క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో చండీహోమం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారిపేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం చండీహోమం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమావాస్యను పురస్కరించుకుని స్వామివారి ఆలయంలో రామలింగేశ్వర స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్ కుమార్‌లు స్వామి, అమ్మవార్లకు పూజా కార్యక్రమాలను, యాగశాలలో చండీహోమం, రుద్రాభిషేకాలను నిర్వహించారు. పలువురు ఉభయదాతలు, భక్తులు తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. పంచహారతుల సేవ నిర్వహించిన అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీలోని శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠంలో బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమ పూజలు, శ్రీచక్రార్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

గంగానమ్మవారి తిరునాళ్ల ప్రారంభం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థాన ఆర్థిక సహకారంతో నిర్మించిన గంగానమ్మవారి వార్షిక తిరునాళ్ల మంగళవారం సంప్రదాయబద్ధంగా ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు జరిగే తిరునాళ్ల మొదటి రోజు గణపతి పూజ, పుణ్యాహవచన, అఖండ దీపారాధన, కలశస్థాపన అంకురార్పణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మానుపూజ మేళతాళాలతో అమ్మవారికి గ్రామ పసుపు, కుంకుమ సమర్పణ దేవాలయ ప్రవేశం అనంతరం అష్టోత్తర శత కలశాభిషేకం(108 కలశాలతో), పంచామృత అభిషేకం కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. దేవస్థానం అర్చకుడు వేణుగోపాల్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

తలసేమియా వంశపారంపర్య వ్యాధి



పెనమలూరు: తలసేమియా వంశపారపర్యంగా వచ్చే వ్యాధి అని, దీని పట్ల అప్రమత్తంగా ఉండాలని న్యూ సిటీ బ్లడ్‌బ్యాంక్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మదన్‌మోహన్ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ తలసేమియా నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మదన్‌మోహన్ మాట్లాడుతూ.. తలసేమియాకు గురైన వారి శరీరంలో ఉండాల్సిన హిమోగ్లోబిన్ తక్కువ శాతంగా ఉంటుందన్నారు. దీని వల్ల రోగి బలహీనపడతారని చెప్పారు. ఫోలిక్ యాసిడ్ ఉన్న ఆహారం తీసుకుంటే తలసేమియా వ్యాధి తగ్గించవచ్చన్నారు. గుడ్డు పచ్చసొన, ఎండిన బీన్స్, చిలకడదుంప, సోయా ఉత్పత్తులు, బఠానీ గింజలు, అరటి పండ్లు తినాలన్నారు. తలసేమియా బాలసేవా పథకం పేద రోగులకు ఆర్థిక సాయం అందిస్తుందని, ఈ పథకం వివరాలకు తనను సంప్రదించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

రౌడీషీటర్‌పై కేసు నమోదు

పెనమలూరు: కార్‌వాష్ షెడ్డు యజమానిపై దాడి చేసిన టీడీపీ నాయకుడు, రౌడీషీటర్ షేక్ రెహమాన్, మరో పది మందిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ పంటకాలువ ప్రాంతానికి చెందిన యార్లగడ్డ ఉమామహేశ్వరరావు కానూరు సనత్‌నగర్‌లో కార్ వాష్ షెడ్డు నిర్వహిస్తున్నాడు. అయితే అదే ప్రాంతానికి చెందిన టీడీపీ నేత రౌడీషీటర్ షేక్ రెహమాన్, తన అనుచరులతో వచ్చి కార్ వాష్ షెడ్డు ముందు తన వాహనం ఆపాడు. తన షెడ్డుకు అడ్డంగా కారు తీయాలని ఉమామహేశ్వరరావుకోరాడు. దీంతో ఆగ్రహించిన రెహమాన్, అతని పది మంది అనుచరులు కార్ వాష్ షెడ్డు యజమాని ఉమామహేశ్వరరావుపై దాడి చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

అనైతిక పద్ధతులతో సుజనా గెలవాలని చూస్తున్నారు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్
- బ్యాంకుల దొంగను తరిమికొట్టాలి
- వ్యాపారులకు అండగా వైఎస్ జగన్ ప్రభుత్వం
- హోల్‌సేల్ పూల మార్కెట్‌లో ఆసిఫ్ ప్రచారం



పూల మార్కెట్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గంలో కూటమికి మద్దతు లేకపోయినా సుజనాచౌదరి అనైతిక పద్ధతుల ద్వారా విజయం సాధించాలని చూస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. నగరంలోని వ్యాపార వర్గాలందరికీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండదండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 37వ డివిజన్ కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ ఆధ్వర్యంలో నగరపాలకసంస్థ కార్యాలయం సమీపంలోని హోల్‌సేల్ పూల మార్కెట్‌లో షేక్ ఆసిఫ్ తన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపార సంఘ నాయకులు ఆసిఫ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆసిఫ్ ప్రతి దుకాణానికి వెళ్లి తనకు అండగా ఉండాలని కోరారు. గడిచిన ఐదేళ్ల పాలనలో సీఎం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయటానికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు.

కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు..

అనంతరం ఆసిఫ్ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబునాయుడుకు చిరు వ్యాపారులంటే చిన్నచూపు అన్నారు. చంద్రబాబు 2014 ఎన్నికల్లో 600లకు పైగా వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చారన్నారు. కానీ అందులో ఏ ఒక్కటి అమలు చేయలేదని చెప్పారు. 2019లో జరిగిన ఎన్నికల్లో చంద్రబాబును రాష్ట్ర ప్రజలు ఇంటికీ పంపిచారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల్లో 99 శాతం అమలు చేశారని చెప్పారు. అనేక రంగాల్లో విప్లవాత్మకమైన సంస్కరణలను తీసుకొచ్చారన్నారు. ఒక్క పశ్చిమ నియోజకవర్గంలోనే రూ.850 కోట్ల మేర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని తెలిపారు. అంతే కాకుండా సుమారు రూ.450 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారన్నారు. అందువల్లనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలని కోరారు. బ్యాంకులను మోసం చేసి వేల కోట్ల రూపాయాల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన నాయకులను నియోజకవర్గం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గుండు అశోక్ కుమార్, ఉపాధ్యక్షుడు సయ్యద్ రఫీ, కార్యదర్శి డి.విఠల్‌కుమార్, కోశాధికారి ప్రకాష్, సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, ఏ.ప్రకాష్, గంగాధర్ రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అపార్టుమెంట్ వాసులతో మాట్లాడుతున్న ఆసిఫ్

అపార్టుమెంట్ వాసులతో సమావేశం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి షేక్.ఆసిఫ్ బుధవారం నైనవరం ఫ్లై ఓవర్ సమీపంలోని పలు అపార్టుమెంట్ వాసులతో సమావేశమయ్యారు. 54వ డివిజన్ కార్పొరేటర్ హర్షద్ ఆధ్వర్యంలో ఫ్లై ఓవర్ సమీపంలోని సాయి అమరావతి హైట్స్, అస్త అపార్టుమెంట్స్, విష్ణుష్ హైట్స్ అపార్టుమెంట్ అసోసియేషన్ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపార్టుమెంట్ వాసులందరూ మద్దతుగా నిలవడంతో పాటు ఎంపీగా కేశినేని నానికి, ఎమ్మెల్యేగా తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సమావేశానికి హాజరైన ఎంపీ కేశినేని నాని కుమార్తె శ్వేత కాలనీవాసులతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వైఎస్సార్ సీపీకి మరోసారి పట్టం కట్టాలని కోరారు. స్థానికంగా తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను నేతల దృష్టికి తీసుకువచ్చారు. బుడమేరు మురుగుతో దోమలు, తాగునీటి సమస్య, పక్కా రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యాపారులు అహ్మదీ, సమద్ తదితరులు పాల్గొన్నారు.

పీఓలు ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

రిటర్నింగ్ అధికారి రాజు



పెనమలూరు: ఎన్నికల్లో పీఓలు, ఏపీఓలు విధులు సక్రమంగా నిర్వర్తించాలని పెనమలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డి.రాజు అన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెనమలూరు నియోజకవర్గానికి చెందిన పీఓలు, ఏపీఓలకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి రాజు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో పీవోలు, ఏపీవోలు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ ప్రారంభమయ్యే ముందు మాక్ పోల్ నిర్వహించాలన్నారు.

ఈవీఎం, వీవీ ప్యాట్ సక్రమంగా ఉన్నాయా లేదో చూసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఉండే ఏజెంట్లకు పాస్‌లు ఉండాలని, నిబంధనల ప్రకారమే పోలింగ్ జరగాలని, ఓటర్లు బహిరంగంగా ఓటు వేస్తే చర్యలు తీసుకోవాలన్నారు. టెండర్ ఓటు వేయాల్సి వస్తే బ్యాలెట్ ఇవ్వాలన్నారు. రిసెప్షన్ సెంటర్ నుంచి తీసుకు వెళ్లే పోలింగ్ సామగ్రి పోలింగ్ ముగిసిన తర్వాత తిరిగి అప్పగించే వరకు పీఓ, ఏపీఓలదే బాధ్యతన్నారు. మూడు మండలాల తహసీల్దార్లు ప్రసాద్, రామకృష్ణ, గురుమూర్తిరెడ్డి పాల్గొన్నారు.

తోడేళ్ల గుంపునకు ఓటమి ఖాయం



ప్రజలకు అభివాదం చేస్తున్న ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి, కేశినేని శ్వేత



ర్యాలీలో ఉత్సాహంగా స్టెప్పులు వేస్తున్న కార్యకర్తలు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్
- పశ్చిమ వైఎస్సార్ సీపీ అడ్డా..
- భవానీపురంలో వైఎస్సార్ సీపీ భారీ ర్యాలీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో బీజేపీ, టీడీపీ, జనసేన తోడేళ్ల గుంపునకు ఓటమి ఖాయమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్, ఎంపీ కేశినేని నాని కుమార్తె శ్వేత పాల్గొన్నారు. 41వ డివిజన్ పరిధిలోని గాలిబ్ షా దర్గా వద్ద ప్రారంభమైన ర్యాలీ స్వాతి సెంటర్, క్రాంబే రోడ్డు, శివాలయం సెంటర్, రిలయన్స్ ట్రెండ్స్ వద్ద మలుపు తిరిగి 39వ డివిజన్‌కు చేరుకుంది. ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డప్పులు, డీజేల కోలాహలం మధ్య ఉత్సాహంగా సాగింది. జై జగన్ , జై కేశినేని, జై ఆసిఫ్ అంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్, కేశినేని శ్వేత, మేయర్ భాగ్యలక్ష్మి ప్రచారం వాహనంపై నుంచి ఫ్యాన్ గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థికి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలంటూ సింబల్ చూపిస్తూ ప్రచారం చేశారు. పార్టీ తలపెట్టిన ఈ ర్యాలీ పూర్తిగా ఎన్నికల విజయోత్సవ ర్యాలీలా సాగింది. పార్టీ కార్యకర్తల్లో జోష్ పెంచింది.

నిజాయతీ పక్షాన నిలవాలి..

ర్యాలీ అనంతరం ఆసిఫ్ మీడియాతో మాట్లాడుతూ.. తాను పశ్చిమంలో పక్కా లోకల్ అన్నారు. తనకు ఏ డివిజన్‌కు వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఇక్కడ వైఎస్సార్ సీపీ విజయం ఖాయమైందని చెప్పారు. స్థానికేతరులకు ఈ నియోజకవర్గంలో స్థానం లేదన్నారు. విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని హ్యాట్రిక్ సాధించడం ఖాయమని స్పష్టం చేశారు. కేశినేని శ్వేత మాట్లాడుతూ.. ర్యాలీ ఆసిఫ్, కేశినేని నాని విజయోత్సవ ర్యాలీలా సాగిందన్నారు. పేదలకు, కార్మికులు, కర్షకుల కోసం పెట్టిన టీడీపీ పార్టీలో కార్పొరేట్లు చేరిపోయారన్నారు. బ్యాంకులు దోచుకున్న వాళ్లు ఇక్కడ పోటీ చేస్తున్నారని, వారిని ఓడించి నిజాయతీ పక్షాన నిలవాలని పిలుపునిచ్చారు. కేశినేని నాని విజయవాడ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. మైనార్టీ వర్గాలకు చెందిన షేక్ ఆసిఫ్, ఎంపీ కేశినేని నాని ప్రజా నాయకులని, వీరిద్దరిని గెలిపించి విజయవాడ పార్లమెంట్, పశ్చిమ నియోజకవర్గాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ర్యాలీలో కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్, చైతన్యరెడ్డి, ఆంజనేయరెడ్డి, గుడివాడ నరేంద్ర, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ పుణ్యశీల, చంద్రశేఖరరెడ్డి, డైరెక్టర్లు, పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధనం కాదు.. సేవ చేసే గుణం ఉండాలి

కేశినేని శ్వేత



45వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కేశినేని శ్వేత, నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాజకీయాల్లో ధనం ఒక్కటే ప్రధానం కాదని, మంచితనం, ప్రజలకు సేవ చేసే గుణం ఉంటే ప్రజలు తప్పకుండా ఆదరిస్తారని వైఎస్సార్ సీపీ అభ్యర్థి విజయవాడ పార్లమెంట్ కేశినేని శ్రీనివాస్(నాని) కుమార్తె కేశినేని శ్వేత అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 45వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మైలవరపు కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఆమె ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, షేక్ ఆసిఫ్ విజయాన్ని కాంక్షిస్తూ 45వ డివిజన్ కొండ ప్రాంతంలో బుధవారం పర్యటించారు. కేశినేని శ్వేత, కృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కొండ ప్రాంతంలో ఉన్న ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. మొన్నటి వరకు అన్ని పథకాలు సక్రమంగా అందాయని, చంద్రబాబు కూటమి నిమ్మగడ్డ రమేష్ చౌదరితో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి అడ్డుకున్నాడని స్థానికులు తెలిపారు. తద్వారా అవ్వాతాతలు, దివ్యాంగులు పింఛన్ కోసం పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావని ఆవేదన వ్యక్తం చేశారు.

స్థానిక కార్పొరేటర్ మైలవరపు లావణ్య, ఆమె తండ్రి కృష్ణ తమ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో కొండ ప్రాంత సమస్యలను పట్టించుకున్న దాఖలాలు లేవని, సీఎం జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నుంచే అభివృద్ధి, సంక్షేమం ఏక కాలంలో జరిగాయని వివరించారు. కేశినేని శ్వేత మాట్లాడుతూ.. బ్యాంకులను దోచుకోవడంతో పాటు ఈడీ కేసులు ఉన్న సుజనా చౌదరి వంటి మోసగాడిని ఒక సామాన్య కార్యకర్త షేక్ ఆసిఫ్‌పై పోటీకి దింపిన టీడీపీ కూటమి సిగ్గుపడాలని మండిపడ్డారు. గత 10 ఏళ్లుగా ఎంపీగా ఉంటూ రూ.8 వేల కోట్లతో విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేసిన కేశినేని నాని నిరంతరం ప్రజా సేవలో నిమగ్నమై ఉంటారన్నారు. ఆయన చేసిన అభివృద్ధిలో ఎయిర్ పోర్ట్, హాస్పిటల్స్, ఫ్లై ఓవర్లు వంటివి అనేకం ఉన్నాయని చెప్పారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ప్రజలకు కేశినేని మార్క్ తెలుసని అన్నారు. అటువంటి మంచి వ్యక్తి కేశినేని నానిని రేపు ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ గెలిపించి హ్యాట్రిక్ కొట్టేలా కృషి చేయాలని కోరారు. అదే విధంగా పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న స్థానికుడు షేక్ ఆసిఫ్‌ను గెలిపించుకుంటే ఆయన మీకు ఐదేళ్లపాటు సేవలు అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మైలవరపు కృష్ణ, కట్టా సత్తెయ్య, ముత్తా వాసు, ముత్యాల రాంబాబు, బైపినేని కోటేశ్వరరావు, డి.రాము, సుంకర నారాయణ, గుండు లక్ష్మి, కోటేశ్వరి, ఏలూరు కిరణ్, శివ, యు.దుర్గారావు, ఎస్ కృష్ణ, సీహెచ్ లక్ష్మణ్, లింగయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన అవసరం



కేబీఎన్ కాలేజీలో మాట్లాడుతున్న డాక్టర్ సమరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అవయవదానంపై అవగాహన అవసరమని రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.సమరం అన్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకరపర్తి భావనారాయణ కళాశాల జాతీయ సేవా పథకం విభాగాల ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన కార్యక్రమాన్ని ఆ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ సమరం మాట్లాడుతూ.. అవయవదానం మహాదానమని చెప్పారు. అవయవదానంపై అవగాహన లేకపోవటంతో ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రధానంగా నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. మన దేశంలోనే 15 మిలియన్ల అంధులు, 30 మిలియన్ల మంది సరైన కంటిచూపు లేని వారు ఉన్నారన్నారు. నిత్యం అనేక వేల మంది మృత్యువాత పడుతున్నారని తెలిపారు. అనేక మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసుల కారణంగా అవయవ దానం చేయటానికి ముందుకు రావటం లేదన్నారు. మనం మరణించిన తరువాత మన కళ్లను దానం చేయటం ద్వారా ఎంతో మంది అంధులకు చూపు ప్రసాదించిన వారమవుతామని చెప్పారు. అవయవ దానాన్ని అందరూ ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అధ్యక్షత వహించారు. పీవోలు డి.పవన్‌కుమార్, ఎన్.సాంబశివరావు, శాంతిబాబు, కల్మాబేగం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి స్వాగతం

విమానాశ్రయం(గన్నవరం): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బుధవారం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)కు విచ్చేశారు. విజయవాడలో జరగనున్న రోడ్‌షోలో పాల్గొనేందుకు ఆయన తిరుపతి నుంచి సాయంత్రం 6.26కు ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ప్రధాన మంత్రికి బీజేపీ రాష్ట్ర నాయకులు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, సుదీష్ రాంబోట్ల, చిరువోలు బుచ్చిబాబు, సుబ్రహ్మణ్యం అర్ముగం, పలువురు టీడీపీ, జనసేన నేతలు స్వాగతం పలికారు. రోడ్‌షో తర్వాత రాత్రి 8.33 గంటలకు తిరిగి ఇక్కడికి చేరుకున్నారు. అనంతరం ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీ బయలుదేరివెళ్లారు. ప్రధాని పర్యటన సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.

చంద్రబాబుకు ముస్లింలు తగిన గుణపాఠం చెబుతారు

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీల రిజర్వేషన్‌ను తొలగిస్తామని చెబుతున్న బీజేపీ పెద్దలను, నరేంద్ర మోదీని ప్రశ్నించే దమ్ము చంద్రబాబుకు ఉందా అని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా ప్రశ్నించారు. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని తన కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహానేత వైఎస్సార్ ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన గొప్ప వరం నాలుగు శాతం రిజర్వేషన్ అని తెలిపారు. ముస్లిం మైనార్టీలను మోసం చేసేందుకే చంద్రబాబు బీజేపీతో కలిశారని, మైనార్టీల హక్కులను కాలరాసే టీడీపీ-బీజేపీ కూటమికి రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలంతా తగిన గుణపాఠం చెబుతారన్నారు. హజ్ యాత్రకు వెళ్లే మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ ఆర్థిక ప్రోత్సాహం అందించడంతో పాటు అన్ని రంగాల్లో వారికి అధిక ప్రాధాన్యతను కల్పించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఉన్న మైనార్టీలంతా జగనన్న వెంటే నడుస్తారని తెలిపారు.

జగనన్న ప్రభుత్వంలోనే నాయీ బ్రాహ్మణులకు న్యాయం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆసిఫ్, నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని జగనన్న ప్రభుత్వంలోనే నాయీ బ్రాహ్మణులకు న్యాయం జరిగిందని ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నగర ప్రధాన కార్యదర్శి పైడాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం విద్యాధరపురంలోని పార్టీ నియోజకవర్గ ఎన్నికల ప్రధాన కార్యాలయంలో నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ.. నాయీ బ్రాహ్మణులను సీఎం జగనన్న అక్కున చేర్చుకుంటే, తోకలు కత్తిరిస్తామని, దేవాలయాల్లో అడుగుపెట్టనివ్వనని అవమానించిన బీసీల ద్రోహి చంద్రబాబు అన్నారు. చంద్రబాబు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటే, ప్రముఖ దేవాలయాలన్నింటిలోనూ పాలకమండలి సభ్యులుగా అవకాశం కల్పించిన ఘనత సీఎం జగనన్నదేనని చెప్పారు. జగనన్న చేదోడు పథకంలో భాగంగా అర్హత ఉన్న ప్రతి సెలూన్ షాపునకు ఏడాదికి రూ.10 వేలు చొప్పున అందించారని, నాయీ బ్రాహ్మణులను ఇతర పేర్లతో పిలవకుండా సమాజంలో గౌరవంగా జీవించేందుకు జీఓ నంబర్ 50ను జగనన్న ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. దేవాలయాల్లోని కల్యాణకట్టలలో పని చేస్తున్న నాయీబ్రాహ్మణులకు జీఓ నెంబర్ 110 ద్వారా ఉద్యోగ భద్రత కల్పిస్తూ నెలకు రూ.20 వేలు కనీస వేతనం ఇచ్చిన మనసున్న సీఎం వైఎస్ జగన్ అన్నారు. అటువంటి నిస్వార్థ నాయకుడు జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత బీసీలపై ఉందని చెప్పారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణులకు సీఎం జగన్ చేసిన మేలుకు సంబంధించి ముద్రించిన కరపత్రాన్ని ఆసిఫ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మల్కాపురం కనకారావు, దాక్షారపు రాము, యలమంచి రాజశేఖర్, పైడాడ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన యువత



పార్టీలో చేరిన యువకులతో ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వరదా ప్రసాద్ ఆధ్వర్యాన 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ నేతృత్వంలో ఆ డివిజన్ జనసేన ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి నవీన్, వివిధ పదవుల్లో ఉన్న పలువురు జనసైనికులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వన్‌టౌన్ నెహ్రూబొమ్మ సెంటర్ నుంచి బుధవారం వారు బైక్ ర్యాలీగా బయలుదేరి విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ దాదాపు ఐదేళ్ల పాటు పార్టీ కోసం కష్టపడిన జనసైనికులను పవన్ కల్యాణ్ టీడీపీకి తాకట్టు పెట్టారని విమర్శించారు. నిన్న మొన్నటి వరకు జనసేన జెండా పట్టుకుని తిరిగిన వారి చేత ఇప్పుడు జెండా కూలీలుగా మార్చేయటం దుర్మార్గమన్నారు. ఇంకా ఎన్నాళ్లు ఇలా ఇతర పార్టీల జెండాలు మోయాలన్న ఆవేదనతో వైఎస్సార్ సీపీలోకి వచ్చారని పేర్కొన్నారు. అంతే కాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపట్ల ఆకర్షితులై, అటువంటి నాయకుడి ప్రభుత్వంలో పని చేసేందుకు స్వచ్ఛందంగా వచ్చారని తెలిపారు. రెడ్డిపల్లి నవీన్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఆసిఫ్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో నాగరాజు, నాని, కోటయ్య, పవన్, చిట్టి, వాసు, ఠాగూర్, నాని, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పీబీ సిద్ధార్థ, ఎన్ఆర్ఐ కళాశాలల మధ్య ఒప్పందం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థులకు మరింత మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు తమ కళాశాల ఆగిరిపల్లికి చెందిన ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలతో ఒప్పందం కుదుర్చుకున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ తెలిపారు. ఈ ఒప్పంద మార్పిడి కార్యక్రమం బుధవారం ఎన్ఆర్ఐ కళాశాల ఆవరణలో జరిగింది. ఒప్పందంతో రెండు కళాశాలలు పరిశోధనలు చేయటం, సాంకేతిక సదస్సులు, సాంకేతిక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించటం, పాఠ్య ప్రణాళికలు రూపొందించడం, అధ్యాపకులకు శిక్షణ ఇస్తామని సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రవికిరణ్ తెలిపారు.

ఆది దంపతులకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు విశాఖపట్నంకు చెందిన శ్రీ సాయి నాట్య భారతీ అకాడమీకి చెందిన పలువురు చిన్నారులు నృత్య నీరాజనాలను అర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై భాగవతుల శిరీషారాణి శిష్య బృందానికి చెందిన 20 మంది చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనకు మంత్రముగ్ధులై ఆసక్తిగా వీక్షించారు.